పత్తి రైతు కన్నీరు..

అర్లి(టీ)లో వెంకటి పత్తి చేను మైదానం

భీంపూర్, అక్టోబర్ 27: పత్తి తన ఇంట సిరులు కురిపిస్తోందని ఆశించాడు భీంపూర్ మండలం అర్లి(టీ) గ్రామానికి చెందిన రైతు గుమ్ముల వెంకటి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన పత్తి పంట చేతికి రాదని శనివారం నాలుగు ఎకరాల పంటను తొలగించి బాధపడ్డాడు. ఇప్పుడు మైదానంగా కనిపిస్తున్నది. ఈ ఉదాంతం గురించి 'నమస్తే తెలంగాణ'లో శనివారం నాలుగు ఎకరాల్లో పత్తి పీకేసిన రైతు శీర్షిక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనంతో ఈ ప్రాంతంలో పత్తి రైతు బాధ అనేది చర్చనీయాంశమైంది.

సర్కారు చేయూత లేక ..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పత్తి రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందేవి. రైతు వేదికల్లో సమావేశాలు, క్షేత్రస్థాయిలో ఏఈవోల సలహాలు, సూచనలు ఇచ్చారు. ఇప్పుడు ఏఈవోలు తమకు ఫీల్డ్ సర్వే ఇచ్చారని సర్కారుకు విజ్ఞప్తి చేస్తూ అయోమయంలో ఉన్నారు. ఇక ఈ ఏడు రైతు భరోసా రాక, రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగక రైతు ఆర్థిక పరిస్థితి బాగాలేదు. దానికి తోడు పత్తి పంట మద్దతు ధర కూడా సంతృప్తిగా లేక రైతు ముందుకు పోలేక వెనుకకు రాలేక అన్నట్లున్నాడు. తమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని పత్తి రైతులు కోరుతున్నారు.

❖ మైదానంలా మారిన పత్తి చేను

భీంపూర్ మండలం అర్లి(టీ) గ్రామానికి చెందిన రైతు గుమ్ముల వెంకటికి మరో ఇద్దరు సోదరులు ఉన్నారు. వారసత్వంగా చేరో 8 ఎకరాల భూమి వచ్చింది, అందులో పెన్‌గంగ దగ్గర 3.18 ఎకరాలున్నది. ఇందులో మొత్తం పత్తి వేశాడు . పెన్‌గంగ ముంపులో 2 ఎకరాలు పోయింది. ఆ పత్తిని సాగు చేస్తే ఖర్చు మీద పడింది. ఇక మిగిలిన 2 ఎకరాలలో కూడా పత్తి కాతపూత తృప్తిగా అనిపించలేదు. ఇతనికి ఉన్న మరో నాలుగెకరాలలో పత్తి, కంది బాగుంది. ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కృషితో ఇతనికి సర్కారు రూ.30 వేల పరిహారం అందించింది. కానీ పెన్‌గంగ దగ్గరి చేనులో పత్తితో ఇక లాభం లేదని భావించాడు. పత్తి ధర కూడా నచ్చలేదు. శనివారం ఈ పత్తి చేనుకు వందనం చేసి పత్తి మొక్కలను తొలగించి బాధపడ్డాడు. ఈ ఘటన వైరల్ అయింది. జిల్లాలో చర్చనీయాంశమైంది. కాగా ఈ విస్తీర్ణంలో జొన్న పంట వేస్తానని రైతు వెంకటి చెప్పాడు. సర్కారు తమకు రుణమాఫీ చేయక ,రైతు భరోసా ఇవ్వక మరింత బాధగా ఉంది. అన్నదాత ఇప్పుడు మళ్లీ దళారుల ఇళ్లకు బాకీలకు వెళ్లే పరిస్థితి వచ్చింది.

కల్తీ విక్రయాలు..

- నిర్మల్ జిల్లాలో అధికారుల తనిఖీలతో బయటపడుతున్న వాస్తవాలు
- హోటల్లో కలర్స్‌తో వంటకాలు.. దుకాణాల్లో నాణ్యతలేని వస్తువుల విక్రయాలు
- నిర్మల్‌లో 2 హోటళ్లు, భైంసాలో ఒక హోటల్‌పై కోర్టు కేసు నమోదు
- లైసెన్స్ లేకుండా దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు

జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 27 : నిర్మల్ జిల్లాలో కొంత మంది వ్యాపారులు కల్తీ విక్రయాలకు తెరలేపుతున్నారు. హోటళ్లు, బేకరీలు, రెస్టారెంట్లు, స్వీట్ దుకాణాలు, మిల్క్ సెంటర్లు, కిరాణ దుకాణాల్లో కొందరు వ్యాపారులు కల్తీ కారక ఆహార ఉత్పత్తులు విక్రయాలు చేపట్టడంతో ప్రజల ప్రాణాలు గాలిలో దీపంలా మారుతున్నాయి. స్వీట్ దుకాణాదారులు క్యాన్సర్ కారక, గడువు మీరిన రసాయనాలు కలుపుతూ స్వీట్లను తయారు చేసి విక్రయిస్తున్నారు. హోటళ్లలో ఫ్రిజ్‌లో నిల్వ ఉండే మాంసం, ఇతర కుళ్లిన ఆహార పద్దార్థాలు వాడుతున్నారు.

లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే ఆరు నెలల జైలు.. రూ.5 లక్షల జరిమానా

నిర్మల్, భైంసా, ఖానాపూర్ ప్రాంతాల్లో ఫుడ్ వ్యాపారం, దుకాణాల సముదాయాలు దాదాపు 2000 వరకు ఉన్నాయి. దాదాపు సగం మందికి మాత్రమే లైసెన్స్‌లు ఉన్నట్లు సమాచారం. లైసెన్స్‌ల గడువు ముగిసినా వాటిని రెనివల్ చేసుకోవడంలో వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. కొంత మంది లైసెన్స్‌లు లేకుండానే తమ వ్యాపారాలు నిర్వహించుకుంటూ ప్రభుత్వానికి లైసెన్స్ ఫీజు చెల్లించకుండా ఆదాయానికి గండి కొడుతున్నారు. ఏడాది పాటు విక్రయాలు జరుపుకునేలా నాణ్యమైన వస్తువులను మాత్రమే ప్రజలకు విక్రయించాలని అధికారులు వీరికి లైసెన్స్‌లు జారీ చేస్తారు. ఏడాది గడువు ముగిసే సరికి నెల ముందుగానే లైసెన్స్‌ను వ్యాపారులు రెనివల్ చేసుకోవాల్సి ఉంటుందని లేకపోతే కొత్త లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. వ్యాపారం నిర్వహించే వ్యాపారులు ఖచ్చితంగా లైసెన్స్ తీసుకోవాలనే నిబంధన ఉంది. లైసెన్స్‌లు లేకుండా వ్యాపారం చేస్తే వారికి ఆరు నెలల జైలు శిక్ష, రూ. 5 లక్షల వరకు జరిమానా విధించే అవకాశాలు ఉన్నాయి. తమ లైసెన్స్ పరిధి ఏ ప్రాంతంలో ఉంటే అక్కడే వ్యాపారం నిర్వహించుకోవాలి.

జిల్లాలో తనిఖీల్లో బయటపడిన వాస్తవాలు..

- భైంసాలోని రుద్రాన్ష్ కన్ఫక్షనరీ దుకాణంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు చేసిన తనిఖీల్లో ఫుడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తూ కాలం చెల్లిన వస్తువులు, ఎలాంటి లేబుల్ లేని వస్తువులను విక్రయిస్తుండడంతో స్టాక్‌ను సీజ్ చేసి నోటీసులు జారీ చేశారు.
- ఖానాపూర్‌లోని రాందేవ్ కాస్మోటిక్ దుకాణంలో నిషేధిత గుట్కాను విక్రయిస్తున్నారు. లేబుల్స్ లేని వస్తువులను విక్రయించడంతో సీజ్ చేసి నోటీసులు జారీ చేశారు.
- ఖానాపూర్‌లోని రాణిగారి రెస్టారెంట్‌లో ఫుడ్ లైసెన్స్ లేకుండా హోటల్‌ను నిర్వహిస్తున్నారు..హోటల్‌లో వండే పదార్థాల్లో కలర్స్‌ను వాడుతుండడంతో ఆహార పదార్థాలను సీజ్ చేసి ల్యాబ్‌కు తరలించారు.
- నిర్మల్‌లోని పలు బేకరీల్లో, పలు హోటళ్లలో తనిఖీలు చేసి ఆహార పదార్థాలను ల్యాబ్‌కు తరలించారు.

❖ నాణ్యమైన పదార్థాలు విక్రయించాలి

నిర్మల్ జిల్లాలో ఫుడ్ వ్యాపారం నిర్వహించే వ్యాపారస్తులు విని యోగదారులకు నాణ్యమైన ఆహార పదార్థాలు మాత్రమే విక్రయించాలి. రోజుల తరబడి నిల్వ చేసిన మాంసాహార పదార్థాలను తినడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారు. నిబంధనల ప్రకారం వ్యాపారులు లైసెన్స్ కలిగి ఉండాలి. జిల్లాలో అనేక మంది కల్తీ పదార్థాలను విక్రయిస్తున్నారు.లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తే ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ. 5 లక్షల వరకు జరిమానా విధించే అవకాశాలు ఉన్నాయి. **-ప్రత్యూష, జిల్లా ఇన్‌చార్జి ఫుడ్ సేఫ్టీ అధికారి, నిర్మల్**

జీవో 317 బాధితులకు న్యాయం చేయాలి

ఎదులాపురం, అక్టోబర్ 27: జీవో 317 బాధిత ఉపాధ్యాయ ఉద్యోగులకు న్యాయం చేయాలని 317 జీవో డిస్లోకేటెడ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పదకంటి అజయ్ కుమార్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోపి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాట చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021 డిసెంబర్ 6న తీసుకువచ్చిన జీవో 317 వలన ఉద్యోగ ఉపాధ్యాయులు ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకు 7 జనవరి 2022 వెళ్లారన్నారు. కాంగ్రెస్ పార్టీ తమ మ్యానిఫెస్టోలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 48 గంటట్లోనే సమస్యను పరిష్కరిస్తామని చెప్పడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు అవుతున్నప్పటికీ ఇప్పటి వరకు సమస్యను పరిష్కరించలేదని గడిచిన తొమ్మిది నెలల్లో మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన సమావేశాలు నిర్వహించారన్నారు. శనివారం జరిగినటువంటి క్యాబినెట్ సమావేశంలో కేవలం స్పౌస్, మ్యూచువల్, మెడికల్ వారిని పంపించడానికి ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. వాస్తవానికి ఎవరైతే జిల్లాలు మారి ఇబ్బందులు పడుతున్న వారికి న్యాయం చేయాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు ఆర్ ప్రకాశ్, రత్నమాల, మధుకర్, సాయిరాం పాల్గొన్నారు.

బస్సులు రాక ఇబ్బందులు పడ్డ భక్తులు

బస్సు కోసం వేచి చూస్తున్న భక్తులు

బాసర, అక్టోబర్ 27 : నిర్మల్ జిల్లా బాసర అమ్మవారి క్షేత్రంలో ఆదివారం భక్తులు బస్సులు రాక ఇబ్బందులు పడ్డారు. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి దర్శనానికి వచ్చారు. మధ్యాహ్నం 4 నుంచి సాయంత్రం 6గంటల వరకు భైంసాకు వెళ్లే బస్సులు రాక పోవడంతో బస్టాండ్ ప్రాంతం, ఆలయ ఆవరణ, రైల్వేస్టేషన్ వద్ద రోడ్డుపై భక్తులు రద్దీ కనిపించింది. అనంతరం నాలుగు బస్సులు ఒకేసారి రావడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. సెలవు దినాల్లో రద్దీ ఎక్కువ ఉంటుంది కావున అర గంటకు ఒక బస్సు నిజామాబాద్, భైంసా వైపు నడపాలని భక్తులు కోరుతున్నారు.

కరాటే డో అసోసియేషన్ జిల్లా కమిటీ

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 27 : తెలంగాణ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడిగా తేజేందర్‌సింగ్ భాటియా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా అమ్ముల భూషణ్, కోశాధికారిగా కొండాజి శ్రీకాంత్, ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ బ్లాక్‌బెల్ట్ ఇన్‌స్ట్రక్టర్లు రవిమృణాలిని, రాజ్‌కుమార్, వంశీ, చిరంజీవి, మనోహర్, రాజశ్రీ, పాల్గొన్నారు. నూతన కార్యవర్గాన్ని జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్ అభినందించారు.

ఒకరిపై కేసు నమోదు

ఎదులాపురం, అక్టోబర్ 27: అమ్మాయిని ప్రేమించి పెండ్లి చేసుకుంటానని శారీరకంగా వాడుకొని వదిలేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్‌లోని ఆర్ఆర్ నగర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి మునగంటి పవన్(24) ఓ కాలనీకి చెందిన అమ్మాయిని ప్రేమించి పెండ్లి చేసుకుని శారీరకంగా వాడుకొని వదిలేశాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మునగంటి పవన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

జువాలజీ గెస్ట్ లెక్చరర్ పోస్టు పునరుద్ధరణ చేయాలి

భైంసా, అక్టోబర్ 27 : ముథోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉర్దూ మీడియంలో జువాలజీ గెస్ట్ లెక్చరర్ పోస్టు పునరుద్ధరణ చేయాలని మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్‌కు ఆదివారం పలవురు వినతి పత్రం అందించారు. ఇక్కడ మోబీన్ హైమద్, అజీజ్ ఖాన్, అబ్దుల్ అహద్ , సయ్యద్ షాహిద్ ఉన్నారు.

సమాజ రక్షణలో పోలీసుల పాత్ర కీలకం

2కే రన్‌లో పాల్గొన్న యువకులు, బోధ్ సీఐ

బజార్‌హత్నూర్, అక్టోబర్ 27: సమాజ రక్షణలో పోలీసుల పాత్ర కీలకమని బోధ్ సీఐ రమేశ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం బజార్‌హత్నూర్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవలో పోలీసులు, ప్రజలు మమేకమై పని చేస్తేనే నేరాలు అదుపులో ఉంటాయని అన్నారు. పాల్గొన్న యువకులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ధారసింగ్, పోలీసులు మోహన్, విజయ్, లక్ష్మి, చంపత్ పాల్గొన్నారు.

పండక్కి బంగారం కొంటారా

గోల్డ్ హాల్‌మార్కింగ్ అంటే ఏమిటి? • ఎందుకిది ప్రధానం.. చార్జీలెంత!

దీపావళి పండుగ వేళ చాలామంది బంగారం కొంటూంటారు. ఇంకా చెప్పాలంటే మన దేశంలో ఇదో సంప్రదాయం.. అంతకుమించి ఓ సెంటిమెంట్. అవును.. ఈ పండక్కి పుత్తడి కొంటే లక్ష్మీ కటాక్షం దక్కిన ట్టేనని ఎంతోమంది నమ్మకం మరి. అయితే ఒకప్పటితో పోల్చితే ప్రస్తుతం మార్కెట్‌లో ఎన్నో రకాల మోసాలు జరుగుతున్నాయి. అమాయక కొనుగోలుదారులకు తక్కువ క్యారెట్ బంగారం అప్పజెప్పి ఎక్కువ సొమ్ము దండుకుంటున్న సంఘటనల్ని చూస్తూనే ఉన్నాం. అందుకే బంగారం నాణ్యతను తెలియజేసే ఎన్నో ప్రమాణాలను తీసుకొచ్చారు. అందులో ప్రధానమైనదే గోల్డ్ హాల్‌మార్కింగ్.

సంగతి..

కొనుగోలుదారుల్లో నమ్మకాన్ని కు బ్యూరో ఆఫ్ ఇండియన్ (బీఐఎస్) పరిచయం చేసినదే ఈ ల్‌మార్కింగ్ ప్రక్రియ. నగలు, కడ్డీలు ఇతరత్రా బంగారు ఉత్పత్తిని తెలియపర్చడంలో ఇది నం. దీని ప్రకారం ప్రతీ నగపై మార్క్, బంగారం నాణ్యతను తెలి 2 క్యారెట్ 916 ప్రమాణం, 6 జిటల్ హాల్‌మార్కింగ్ యూనిక్ ఐడీ)లు ఉంటాయి. ఒక ఆభరణం మీద ఉన్న ఐడీ మరొక ఆభరణం మీద ఉండదు. సులభంగా ఆ ఐడీతో అన్ని వివరాలు తెలుస్తాయి. ఈ హాల్‌మార్కింగ్‌ను కేంద్ర ప్రభుత్వం నగల అమ్మకందారులందరికీ తప్పనిసరి చేసింది.

బీఐఎస్ హాల్‌మార్క్

ఇది మీరు కొనే బంగారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ద్వారా నిర్వహించే లైసెన్స్‌డ్ లాబొరేటరీలో పరిశీలించబడినది అన్నదాన్ని సూచిస్తుంది. అలాగే ఇవి తాము అమ్మిన బంగారు ఆభరణాలని సూచించేలా కొందరు జ్యుయెల్లర్స్ తమ సొంత యూనిక్ ఐడెంటిఫికేషన్ మార్క్‌లనూ నగలపై వేస్తున్నారు. సాధారణంగా వారి బ్రాండ్లు, దుకాణాల పేర్లతో ఇవి ముడిపడి ఉంటున్నాయి.

చార్జీలు ఇలా..

మన దగ్గరుండే పాత బంగారు ఆభరణాలకూ హాల్‌మార్కింగ్ చేయించుకోవచ్చు. బీఐఎస్ నమోదిత జ్యుయెల్లర్స్ వద్దకు వెళ్లి వారి ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. లేదా బీఐఎస్ గుర్తించిన అస్సేయింగ్ అండ్ హాల్‌మార్కింగ్ సెంటర్ల (ఏ హెచ్‌సీ)కు వెళ్లి అక్కడ ఈ పనిని చేసుకోవచ్చు. మీ నగల నాణ్యతను పరిశీలించిన తర్వాతే హాల్‌మార్కింగ్ జరుగుతుంది. చార్జీలు ఒక్కో బంగారు ఆభరణానికి రూ.45గా తీసుకుంటారు. వెండి వస్తువులకూ ఉంటుంది. అందుకు రూ.35 తీసుకుంటారు. కన్‌సైన్‌మెంట్ కోసమైతే కనీస చార్జీ బంగారానికి రూ.200, వెండికి రూ.150గా ఉంటుంది. వీటికి సర్వీస్ ట్యాక్స్, ఇతర చార్జీలు అదనం. బరువుతో సంబంధం లేకుండా ఈ చార్జీలు పడుతాయి. కొత్తవి షాపుల్లో కొంటున్నప్పుడైతే తయారీ, మజూరీ (మేకింగ్, వేస్టింగ్) చార్జీల్లో ఈ హాల్‌మార్క్ చార్జీలు కలువవు. వీటిని వేరుగా చెల్లించాల్సి ఉంటుంది. ఇక గతంలో నాలుగైదు సంకేతాలతో హాల్‌మార్కింగ్ ఉండేది. అదిప్పుడు మూడుకు తగ్గింది. కాబట్టి పాత హాల్‌మార్కింగ్‌కూ విలువ ఉంటుంది. అందులో హెచ్‌యూఐడీ లేదని ఆందోళన చెందనక్కర్లేదు.



ప్యూరిటీ

బంగారం నాణ్యతను క్యారెట్లలో కొలుస్తారు. 24 క్యారెట్ (99.9%) అంటే పూర్తిగా స్వచ్ఛమైన బంగారమే. మార్కెట్‌లో ఇది బిస్కట్లు, కడ్డీలు, నాణేల రూపంలో లభిస్తుంది. 22 క్యారెట్ (22K916) అంటే అందులో 91.6 శాతం నాణ్యమైన బంగారం ఉంటుందన్న మాట. మనం కొనే ఆభరణాలు ఈ నాణ్యతతోనే ఉంటాయి. అచ్చంగా పసిడితోనే నగలు తయారుకావు. అందుకే రాగి, ఇతరత్రా లోహాలను కలపాల్సి ఉంటుంది. దానివల్ల నాణ్యత కొంత తగ్గుతుంది. ఇక 18 క్యారెట్ (18K750) అంటే ఇందులో బంగారం 75 శాతం మాత్రమే ఉంటుంది. మిగతా 25 శాతం ఇతర లోహాలుంటాయి. 14 క్యారెట్ (14K585)లో బంగారం పరిమాణం 58.5 శాతమే. క్యారెట్ ప్రామాణికత తగ్గినకొద్దీ ధరలూ తగ్గుతూంటాయి. అందుకే అత్యధిక ధరను పెట్టి కొనే నగలపై 22K916 ఉంటుందన్నది గుర్తుంచుకోవాలి.

రాబడి

చిన్న బ్యాంకు.. పెద్ద వడ్డీ

స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో ఎఫ్‌డీలు అదుర్స్

సీనియర్ సిటిజన్లకు 9.50% వడ్డీరేటు

ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ).. రిస్కుకు దూరంగా, సురక్షితమైన పెట్టుబడికి చక్కని నిర్వచనం. అయితే ఇతర పెట్టుబడి సాధనాలతో పోల్చితే మాత్రం రాబడులు తక్కువ. కానీ కొన్ని బ్యాంకుల్లో ఎఫ్‌డీలపైనా ఆకర్షణీయ వడ్డీరేట్లున్నాయి. ఏకంగా 9 శాతానికిపైగానే వడ్డీ లభిస్తుండటం గమనార్హం. అవును.. సీనియర్ సిటిజన్లకు పలు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో గరిష్ఠంగా 9.50 శాతం వరకు వడ్డీరేటు వస్తున్నది.

- **నార్త్‌ఈస్ట్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్**
  546-1,111 రోజుల (18 నెలల ఒక్క రోజు- మూడేండ్ల 16 రోజులు) కాల వ్యవధి ఎఫ్‌డీలపై అత్యధికంగా సీనియర్ సిటిజన్లకు 9.50 శాతం వడ్డీరేటు నిస్తున్నది. రూ.5 కోట్లలోపు ఎఫ్‌డీలకే వర్తిస్తుంది. ఈ ఏడాది జూన్ 25 నుంచి ఈ రేటు అమల్లోకి వచ్చింది.
- **సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్**
  రెండేండ్ల నుంచి మూడేండ్లదాకా చేసే ఎఫ్‌డీలపై సీనియర్ సిటిజన్లకు ఇక్కడ 9.10 శాతం వడ్డీరేటు ఉంటుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 4 నుంచి వర్తిస్తున్నది.
- **యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్**
  సీనియర్ సిటిజన్లకు 1,001 రోజుల ఎఫ్‌డీపై 9.50 శాతం వడ్డీరేటు, 701 రోజుల ఎఫ్‌డీపై 9.25 శాతం వడ్డీరేటును ఈ బ్యాంక్ ప్రకటించింది. ఈ నెల 7 నుంచే ఇవి అమల్లోకి వచ్చాయి.
- **ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్**
  1,001 రోజుల ఎఫ్‌డీపై 9.10 శాతం, 1,500 రోజుల ఎఫ్‌డీపై 9.25 శాతం వడ్డీరేట్లను సీనియర్ సిటిజన్ల కోసం ఈ బ్యాంక్ ఇస్తున్నది. ఈ ఏడాది జూన్ 7 నుంచి ఈ రేట్లు అమలవుతున్నాయి.

అదనపు సౌకర్యాలు

చాలా బ్యాంకులు సీనియర్ సిటిజన్లకు ఎఫ్‌డీలపై అదనపు వడ్డీరేట్లను అందిస్తున్నాయి. ఫిక్స్‌డ్ చేసే మొత్తాల ఆధారంగా ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో 0.50 శాతం నుంచి 0.75 శాతం మేర ఎక్కువ వడ్డీరేట్లు అమలవుతున్నాయి. అంతేగాక వృద్ధులకుండే సమస్యలు, ముఖ్యంగా ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఎఫ్‌డీలపై రుణాలనూ బ్యాంకర్లు ఇస్తున్నారు. అయితే చేసే ఎఫ్‌డీలపై ఈ రుణ మొత్తాలు ఆధారపడి ఉంటాయి. పెద్ద ఎఫ్‌డీలపై అంతే మొత్తాల్లో రుణ సదుపాయం దొరుకుతుంది. ఈఎంఐల్లో ఈ లోన్లను తీర్చుకోవచ్చు. ఇక అత్యవసరాల దృష్ట్యా ఎఫ్‌డీల ముందస్తు ఉపసంహరణలకూ కొన్ని సంస్థలు అనుమతినిస్తున్నాయి. అయితే ఇందుకు స్వల్ప మొత్తాల్లో జరిమానాలను చెల్లించాల్సి ఉంటుంది. 60 ఏండ్లు, ఆపై వయసుగలవారు తమ ఎఫ్‌డీలపై పొందే వడ్డీ ఆదాయానికి టీడీఎస్ మినహాయింపు కోసం సెల్ఫ్ డిక్లరేషన్ ఫామ్ 15హెచ్‌ను సమర్పిస్తే ప్రయోజనాన్ని అందుకునే అవకాశాలున్నాయి. ఐటీ చట్టం 1961లోని సెక్షన్ 197ఏ, సబ్‌సెక్షన్ 1సీ ఇందుకు వీలు కల్పిస్తున్నది. వడ్డీరేట్లు, కాల వ్యవధి, ఇతర ప్రయోజనాలు సీనియర్ సిటిజన్లకు అత్యుత్తమ ఎఫ్‌డీ ఏది అనేది నిర్ణయిస్తాయి. కాబట్టి ఎఫ్‌డీని తీసుకొనే ముందు దాని ఫీచర్లను గమనించాలి.

అమ్మకాల ఒత్తిడిలోనే..

మార్కెట్ పల్స్



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. దేశ, విదేశీ అననుకూలతల మధ్య మదుపరులు పెట్టుబడులకు దూరంగానే ఉంటున్నారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,822.46 పాయింట్లు లేదా 2.24 శాతం పడిపోయి 79,402.29 వద్ద ఆగింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 673.25 పాయింట్లు లేదా 2.70 శాతం పతనమై 24,180.80 దగ్గర ముగిసింది. ఈ క్రమంలో ఈ వారం కూడా అమ్మకాల ఒత్తిడికే అధిక అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికానికి (జూలై-సెప్టెంబర్)గాను కార్పొరేట్ కంపెనీలు ప్రకటించే ఆర్థిక ఫలితాలు మునుపటిలాగే మార్కెట్ ట్రేడింగ్‌ను ప్రభావితం చేయనున్నాయి. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిస్థితులు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, ముడి చమురు ధరలు ఎప్పట్లాగే ఈసారీ భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,800 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,500-24,700 మధ్యకు వెళ్లవచ్చని చెప్తున్నారు.

గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

ఈ రంగాలపై ఓ లుక్కేయండి

మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులకు అవకాశాలున్నవివే

మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులు పెట్టాలని మీరు యోచిస్తున్నట్లైతే.. అందుకు ఈ దీపావళియే సరైన సమయమని మెజారిటీ మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. పైగా కొన్ని రంగాలను పరిశీలించాలని కూడా సిఫార్సు చేస్తున్నారు. వాటిలో మధ్య-చిన్న శ్రేణి ఐటీ కంపెనీలు, దేశీయ ఫార్మా సంస్థలు, పాత ప్రైవేట్ రంగ బ్యాంకులు, ఎఫ్ఎంసీజీ, ట్రైర్ల తయారీ సంస్థల స్టాక్స్ అనుకూలంగా ఉన్నట్టు చెప్తున్నారు. అయితే ప్రస్తుతం మార్కెట్లు నష్టాల్లో నడుస్తున్నాయి. పలు దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. దీంతో చిన్నచిన్న మొత్తాల్లో పెట్టుబడులకు దిగాలని కూడా ఎక్స్‌పర్ట్స్ సలహా ఇస్తున్నారు. ఇందుకోసం సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)ను ఎంచుకోవడం ఉత్తమమని అభిప్రాయపడుతున్నారు. వీక్లీ, మంత్లీ, త్రైమాసిక పద్ధతుల్లో పెట్టుబడులకు వీలుంటుందని, వెయ్యి రూపాయలతో కూడా మదుపును మొదలు పెట్టవచ్చంటున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో సిప్‌ల్లోకి నిధుల వరద మునుపెన్నడూ లేనివిధంగా రూ.24,509 కోట్లుగా ఉండటం గమనార్హం. మొత్తానికి ఔషధ, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో పెట్టుబడులకు ఆకర్షణీయ రాబడులకు ఆస్కారం ఉందని పేర్కొంటున్నారు. అయితే మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు స్టాక్ మార్కెట్ రిస్కులకు లోబడి ఉన్నందున నిపుణులను సంప్రదించి పెట్టుబడులకు దిగితే ఇంకా లాభించవచ్చు. అంతేగాక స్వల్పకాలిక పెట్టుబడుల కంటే దీర్ఘకాలిక పెట్టుబడులు కలిసొస్తాయన్న వాదనలూ ఉన్నాయి.